క్లుప్తంగా

వనపర్తి డీపీఆర్‌ఓగా సీతారాంనాయక్

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి సీతారాంనాయక్‌ను పదోన్నతిపై వనపర్తికి బదిలీ అయ్యారు. ఆయనకు జిల్లా పౌర సంబంధాల అధికారిగా పదోన్నతి కల్పిస్తూ, వనపర్తి జిల్లాకు నియమిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు వనపర్తితో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా పౌర సంబంధాల అధికారిగా అదనపు బాధ్యతలను నిర్వహించాలని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ అందజేత



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన బాల్‌రెడ్డికి కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో ఆయనకు మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని బుధవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బాల్‌రెడ్డి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి సీఎం సహాయనిధి నుంచి ఎల్‌ఓసీని మంజూరు చేయించినట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎల్‌ఓసీని మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు, మంజూరుకు కృషి చేసిన స్థానిక నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బోనాల పండుగ



గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని తల్పునూరులో బుధవారం బోనాల పండుగ వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఇళ్లలో బోనం కుండలను తయారు చేసుకుని డప్పులతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు.

కాంగ్రెస్‌పై విషప్రచారాన్ని అడ్డుకోవాలి



ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీకి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో విషప్రచారం చేస్తున్న వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌ఐ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో అధికార పార్టీకి చెందిన కొంతమంది పని కట్టుకుని అసభ్యపదజాలంతో వాయిస్ మెసేజ్‌లు, ఇతర తప్పుడు, కల్పిత వార్తలను పోస్ట్ చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, పరమేష్, శ్రీను, జబ్బార్, గణేష్‌ముదిరాజ్, వెంకటన్న, బుచ్చన్న, ఈర్లదిన్నె శ్రీను తదితరులు ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



వీపనగండ్ల: ప్రభుత్వ వసతిగృహాల్లో పనిచేస్తున్న సిబ్బంది అంకితభావంతో పనిచేసినప్పుడే విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో విద్యనభ్యసించగలరని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్ శివయ్యను ఆదేశించారు. హాస్టల్‌లో మెరుగైన వసతుల కోసం ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటామన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



అమరచింతలో మాట్లాడుతున్న ఎస్‌ఐ జగన్మోహన్

అమరచింత: ప్రస్తుత కాలంలో ఎదుటి వారిని మోసం చేస్తూ ఆర్థిక దోపిడికి పాల్పడటమే కాకుండా వేధించే వ్యక్తుల గురించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్‌ఐ జగన్మోహన్ అన్నారు. కేజీబీవీ పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు సైబర్ నేరాలు, వేధింపుల గురించి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయం పెంచుకోవడం వల్ల అనర్థాలు కలుగుతున్నాయన్నారు. అపరిచిత వ్యక్తులకు ఫోన్ నెంబర్లు ఇవ్వడం, చాటింగ్ చేయడం వంటి సంఘటనలతో ఎందరో మోసపోతూ ప్రాణాలు తీసుకున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, టెక్నాలజీని మంచి కోసం వినియోగించుకోవాలని సూచించారు. వసతి గృహాలు, కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులు రాత్రివేళల్లో బయటకు రాకూడదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌ఓ షబాన, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నివారించాలి

పాన్‌గల్: మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించేందుకు అందరూ బాధ్యత కృషి చేయాలని ఎస్‌ఐ వేణు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల నిరోధం, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిరోధంలో యువత ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం, విక్రయిస్తే విధించే శిక్షల గురించి, ఈవ్‌టీచింగ్, సైబర్ క్రైం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులకు తమ వ్యక్తిగత విషయాలు, బ్యాంకు, ఆధార్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదన్నారు. విద్యార్థులు గ్రామాల్లో సైబర్ క్రైం, మాదక ద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించి ఉన్నత శిఖిరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ వేణు

కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు వెంకటేష్, వెంకట్‌రెడ్డి, సువర్ణ, సలాంపాష, బాలనాగరాజు, ఆనంద్, కురుమూర్తి, రాఘవేంద్రచారి, చంద్రశేఖర్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది



అమరచింతలో ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ కలాంపాషా



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది దేశం గర్వించే స్థాయికి చేర్చే ఉపాధ్యాయుల తోడ్పాటు అద్వితీయమని ఎంపీపీ బంగారు శ్రీను, జెడ్పీటీసీ శివరంజని, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్, ఎంఈఓ భాస్కర్ సింగ్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌కు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల వృత్తి ఎంతో పవిత్రమైందని వృత్తి ధర్మం సక్రమంగా నిర్వర్తిస్తూ విద్యార్థులకు బంగారుబాట వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వీరన్న, విజయ్, శ్యామ్, మల్లేష్, భార్గవి, ఆనంద్‌గౌడ్, మచ్చేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అమరచింత: సమాజంలో మంచి, చెడుల గురించి వివరించడమే కాకుండా విద్యను బోధిస్తూ విద్యార్థులలో మేధస్సును పెంచుతున్న ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ కలాంపాషా అన్నారు. పట్టణంలోని విజేత ఉన్నత పాఠశాలలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో పాఠశాల కరస్పాండెట్ లక్ష్మీనారాయణ, ప్రాధానోపధ్యాయుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి నుంచి మట్టి సేకరణ

వనపర్తి టౌన్: ప్రధాన మంత్రి మోదీ పిలుపు మేరకు మేరా దేశ్ మేరా మట్టి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి బుధవారం మట్టి సేకరించారు. ఈ మేరకు బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చురాం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాయిగడ్డలో ఉన్న అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి, ఆలయ పరిసర మట్టిని, బ్రాహ్మణ వీధి, పోచమ్మ గుడి, పాతబజార్, కుమ్మరి వీధి, జమ్మి చెట్టు ప్రాంతాల ప్రజల నుంచి, ముఖ్యంగా ఆర్మీలో పనిచేస్తున్న కుటుంబ సభ్యుల నుంచి మట్టి సేకరించారు. ఈ సందర్భంగా బచ్చురాం మాట్లాడుతూ.. అమృత్ మహోత్సవం 75 ఏళ్ల దేశ నాయకులు, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి మట్టి సేకరించి మొక్కలు నాటడమనేది గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బండారు కుమార్‌స్వామి, ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులు పరశురాం, రామ్‌మోహన్, బాబురావు, దళిత మోర్చా అధ్యక్షుడు కుమార్, జిల్లా నాయకులు వెంకటేష్, జేపీ వెంకట్, మహేష్, పీఎం రామ, బుడ్డన్న, రాయన్నసాగర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



వనపర్తి టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ నగదు, పర్సు పోగొట్టుకున్న ఓ మహిళకు పర్సు తిరిగి ఇచ్చి కండక్టర్ నిజాయితీ చాటుకున్నారు. బుధవారం వనపర్తి ఆర్టీసీ బస్సు ఖిల్లాఘనపురం నుంచి వనపర్తికి వస్తుండగా ఓ మహిళ తన పర్సు మరిచిపోయి దిగి వెళ్లిపోయింది. ఆ మహిళ పర్సులోనే ఉన్న తమ ఫోన్ చేయగా.. కండక్టర్‌కు కాల్ లిఫ్ట్ చేసి పర్సు తన వద్దే ఉందని, డిపోకి వచ్చి తీసుకోవాలని సూచించారు. దీంతో మహిళ డిపోకు చేరుకొని పర్సు తీసుకుంది. పర్సులో ఫోన్, రూ.8,500 నగదు, వెండి ఉందని, అన్ని వస్తువులు పర్సులోనే భద్రంగా ఉన్నట్లు మహిళ తెలిపింది. దీంతో నిజాయితీ చాటుకున్న కండక్టర్‌కు ఆర్టీసీ సిబ్బంది అభినందించారు.

రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు



మాట్లాడుతున్న నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి వయా దేవబండతండా మీదుగా నేలబండతండా వరకు 3 కిలోమీటర్ల బీటీ రోడ్డు కోసం రూ.1.80 కోట్ల నిధులు మంజూరు చేశారని ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య తెలిపారు. కర్నెతండా నుంచి మేడిబావి తండా వరకు 4.2 కిలోమీటర్లకు పనులకు రూ.3 కోట్లు కేటాయించారన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కృష్ణవేణి, పీనా నాయక్, గోపాల్ నాయక్, రాజు నాయక్, నరేష్ నాయక్, శ్రీను నాయక్ నాయకులు గోపాల్‌నాయక్, దేవిజానాయక్, కృష్ణానాయక్, శ్రీనునాయక్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపూర్, బున్యాదిపూర్ గ్రామాల్లో ఈవీఎం ఓటింగ్ మిషన్ ఓటు హక్కు వినియోగంపై గురువారం కళాజాతా బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశాల మేరకు ఈవీఎం ఓటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 18ఏళ్ల యువత, ప్రతి ఓటరుకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పనితీరు, పరిశీలన గురించి వివరించారు. అలాగే వనపర్తి నియోజక వర్గంలో అనేక గ్రామాల్లో కళాబృందం తమ యొక్క ఆటపాటల ద్వారా చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గట్టయ్య, వనం గోవిందమ్మ, సువర్ణ, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



మదనాపురంలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ఆత్మకూర్: పట్టణ కేంద్రంలోని శ్రీవాణి హైస్కూల్లో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ఉట్టిని విద్యార్థులు ఉత్సాహంగా పగులగొట్టారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలో విద్యార్థులు అలరించారు, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ టీజే విశ్వేశ్వర్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు లత, శ్రీమాళి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు పలువురిని ఆకట్టుకున్నారు. సృష్టి స్థితి కారుడైన శ్రీకృష్ణుడి జన్మదినాన్ని కృష్ణాష్టమిగా జరుపుకుంటారని పాఠశాల హెచ్‌ఎం అలివేలు విద్యార్థులకు వివరించారు.

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని బ్రిలియంట్, మాంటేశ్వరి, మాస్టర్ మైండ్ పాఠశాలలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషాలు ధరించేసి ఉట్టి కొట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తల్లిదండ్రులను అలరించారు.

మదనాపురం: మండల కేంద్రంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కృష్ణుడు, రుక్మిణి, గోపికల వేషాధారణలో చిన్నారులు ఎంతగానో ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉట్టి కొట్టారు.

వీపనగండ్ల: కృష్ణాష్టమి పర్వదినాన్ని బుధవారం గోవర్ధనగిరి ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆత్మకూర్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు



ఏదులలో..

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ భారతి

అమరచింత: పోషక విలువలు గల ఆహారం తీసుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ భారతి అన్నారు. మండలంలోని నందిమళ్లలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించి పోషక విలువల గురించి బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పౌష్టికత్వంతో కూడిన ఆహార పదార్థాలను అందిస్తున్నారన్నారు. పుట్టిన చంటి పిల్లలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పూర్వ కాలం నాటి మనుషులకు ఎలాంటి రోగాలు రాకపోవడానికి గల కారణం అప్పట్లో బిడ్డలకు తల్లి పాలు తప్పనిసరిగా తాపేవారన్నారు. మారుతున్న కాలంలో రకరకాల రోగాలు వ్యాపిస్తున్నాయని, వీటికి దూరంగా తమ పిల్లలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రసూతి, గర్భిణుల కోసం ఎన్నో కార్యక్రమాలను తీసుకొచ్చిందని, అందులో భాగంగానే పోషణమాసంతో పాటు తల్లి పాల విశిష్టత గురించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి మహిళలను చైతన్యం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుడిసెల పోరుకు ఏడాది పూర్తి



కేక్‌కట్ చేస్తూ సంబురాల్లో పాల్గొన్న లబ్ధిదారులు

అమరచింత: ఇచ్చిన ఇంటి స్థలాలకు పొజిషన్ చూపాలంటూ లబ్ధిదారులు గుడిసెలు వేసుకొని నిర్వహిస్తున్న గుడిసెల పోరు కార్యక్రమం బుధవారం నాటికి ఏడాది పూర్తి చేసుకోవడంతో లబ్ధిదారులు కేక్ కట్ చేసి సంబురాలు చేశారు. కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి తో పాటు ఐద్వా సంఘాల నాయకులు హాజరైయ్యారు. ప్రభుత్వం 22 ఏళ్ల కిందట పట్టణానికి చెందిన 460 మంది లబ్ధిదారులకు సర్వే నంబర్ 567, 568 లో ఇంటి నిర్మాణాల కోసం పట్టాలు ఇచ్చారు. ఇప్పటి వరకు ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలాలు చూపకపోవడంతో లబ్ధిదారులు తమకు ఇంటి స్థలాలు చూపాలంటూ గుడిసెలు వేసుకొని పోరాటం చేస్తున్నారు. అక్కడే జీవనం సాగిస్తున్నా అధికారులు, ఎమ్మెల్యే పట్టించుకోక పోవడం ఏమిటని సీపీఎం నాయకులు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారుల ఆందోళనకు సీపీఎం పూర్తి స్థాయిలో మద్దతు ఇచ్చి ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో అజయ్, ఆర్ ఎస్ రమేష్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

నిజాయితీగా విధులు నిర్వర్తిస్తేనే గుర్తింపు



కృష్ణయ్య దంపతులను సన్మానిస్తున్న శ్రీధర్

వనపర్తి టౌన్: పదవి విరమణ వృత్తికే అని, వ్యక్తి కాదని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. పెబ్బేర్ బీమా ప్రాజెక్టులో జూనియర్ అసిస్టెంట్‌గా 30 ఏళ్లుగా విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందిన కృష్ణయ్య దంపతులను బుధవారం జిల్లా కేంద్రంలోని 30వ వార్డు సాయినగర్ కాలనీలోని తన నివాసంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. వృత్తి పట్ల శ్రద్ధ, నిజాయితీతో పనిచేసి నీటిపారుదల శాఖలో మంచి పేరు తెచ్చుకున్న కృష్ణయ్య సేవలు ఎనలేనివని కొనియాడారు. వృత్తిలో విరమణ పొందారని, వ్యక్తిగా సమాజసేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో పాన్‌గల్ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మణి కలెక్షన్ శశి, నాని పాల్గొన్నారు.

17న గరికపాటి భగవద్గీత సందేశం



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆత్మకూర్: 'నిత్య జీవితంలో భగవద్గీత' అనే అంశంపై గరికపాటి నరసింహారావుతో సందేశ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, జెడ్పీటీసీ శివరంజని, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేష్, మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ సమావేశానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేసారు. ఈనెల 17వ తేదీన స్థానిక ఎంవీరామన్ పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి నృత్యాలు, అన్నమయ్య సంకీర్తనలు, భగవద్గీత శ్లోకాలు, ఆధ్యాత్మిక గీతాలాపన, సాయంత్రం నాలుగు గంటలకు గరికపాటి నిత్యజీవితంలో భగవద్గీత అనే అంశంపై సందేశం ఉంటుందని, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

యూనియన్ బ్యాంక్ ఎదుట బారులు



అమరచింత యూనియన్ బ్యాంక్ ఎదుట బారులు తీరిన ఖాతాదారులు

అమరచింత: పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఎదుట ఖాతాదారులు భారీగా క్యూలైన్‌లో నిల్చోవడం చూస్తుంటే ఇదేదో అప్పట్లో నోట్ల మార్పిడి కోసం బారులు తీరిన ప్రజలు గుర్తొస్తారు. కానీ ఇక్కడ కనిపిస్తున్న దృశ్యం అది కాదండోయ్.. పంట రుణాలను మాఫీ చేయడంతో వాటి సంబంధించిన నగదును డ్రా చేసుకోనేందు కోసం రైతులు బుధవారం బ్యాంక్ వద్దకు భారీగా తరలి వచ్చారు. దీంతో మేనేజర్ రద్దీని నియంత్రించాలనే ఉద్దేశ్యంతో ఖాతాదారులను క్యూలైన్ నిల్చోబెట్టి ఒక్కొక్కరుగా బ్యాంక్‌లోకి పంపిచారు. బ్యాంకు పరిధిలో 7వేల మంది రైతులకు పైగా రుణాలను పొందితే ప్రస్తుతం 12 వందల మందికి మాత్రమే రుణమాఫీ వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

స్థలం కేటాయించండి



ఆత్మకూర్: పట్టణంలోని ముస్లింలకు ఖబరస్తాన్ (శ్మశానవాటిక)కు ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ ముస్లింలు తహసీల్దార్ రాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణ శివారులోని జూరాల రోడ్డుపై నాలుగు ఎకరాలకుపైగా ప్రభుత్వ స్థలం ఉందని, ఆ భూమిని ముస్లింలకు కేటాయించాలని కోరారు. పెరుగుతున్న జనాభా రీత్యా పాత శ్మశానవాటికలో స్థలం సమాధులతో నిండిపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఈవిషయమై గతంలోనే ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కలెక్టరుకు విన్నవించుకున్నామని, సర్వే కూడా చేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ నాయకులు గయాసుద్దీన్, రియాజ్‌అలీ, జబ్బార్, ఫయాజ్, వాహీద్, వసీం, ఫిరోజ్, అమీర్ ఉన్నారు.